
అశ్వారావుపేట రూరల్ : సరిహద్దుల్లో జాతరను తలపిస్తున్న కోడి పందేల స్థావరాలు

# పల్లెల్లో సందడే సందడి

## ఘనంగా సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి పర్వదినాన్ని జిల్లా ప్రజలు మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి ఇంటి ఆవరణలో రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. ముగ్గుల నడుమ గొబ్బెమ్మలను పేర్చి కూరగాయలు, రేగుపళ్లను పోశారు. బంధువులు, ఆడబిడ్డల రాకతో పల్లెలు జన సందోహంతో సందడిగా మారాయి. ఇళ్ల ముందు రంగవల్లుల అలంకరణలు, ఇళ్లలో పిండివంటల సువాసనలతో గ్రామాల్లో పండుగ ఘనంగా జరిగింది. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివరించారు. జిల్లా సరిహద్దు ఆంధ్రప్రదేశ్‌లో జోరుగా సాగిన కోడి పందేలకు పందెం రాయుళ్లు క్యూ కట్టారు. అశ్వారావుపేట మండలంలో ముంబై ఇన్‌కాం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ పిర్యా నాయక్ సంక్రాంతి సంబురాల్లో పాల్గొని సందడి చేశారు. మండలంలోని వినాయకపురం గ్రామంలో బీఆర్ఎస్ మండల నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు పిర్యా నాయక్‌ను శాలువాతో సత్కరించారు. మూడు రోజులు పాటు ప్రభుత్వం సైతం అనధికారికంగా అనుమతులు ఇవ్వడంతో పోలీసులు భయం లేదని మండల ప్రజలు ఆంధ్ర ప్రాంత సరిహద్దు గ్రామాలకు భారీగా తరలివెళ్లారు.

– నమస్తే నెట్‌వర్క్


ఇల్లెందు : పిల్లలకు పతంగులు పంపిణీ


చంద్రుగొండ : ఆంధ్రా ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్న దృశ్యం


అశ్వారావుపేట : ముంబై ఇన్‌కం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ పీర్యా నాయక్‌ను సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


జూలూరుపాడు : పాపకొల్లు శివాలయంలో భక్తుల పూజలు


అశ్వారావుపేట : బొమ్మల కొలువు ఏర్పాటు చేసిన దృశ్యం


దమ్మపేట రూరల్ : సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న స్పెయిన్ చిత్రకారుడు


కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు


చర్ల : దేవాలయాల్లో ప్రత్యేక పూజల్లో భక్తులు


రామవరంలో ముగ్గు వేస్తున్న యువతి


టేకులపల్లి : వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

## లొంగిపోయిన నలుగురు హార్డ్‌కోర్ మావోయిస్టులు


లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొత్తగూడెం క్రైం, జనవరి 15: ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట నలుగురు హార్డ్‌కోర్ మావోయిస్టులు లొంగిపోయారు. వివరాలను నారాయణ్‌పూర్ జిల్లా పోలీసు అధికారులు బుధవారం వెల్లడించారు. నారాయణ్‌పూర్ జిల్లా తాడిమెట్ల ఘటనలో పాల్గొన్న హార్డ్‌కోర్ మావోయిస్టు కమాండర్ అరబ్ అలియాస్ కమలేష్‌తో సహా మరో ముగ్గురు మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. నారాయణ్‌పూర్ జిల్లాలో 'నియానార్.. నియా పోలీస్'తో పాటు 'హమారా గావ్.. హమారా పోలీస్' కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో మావోయిస్టులు లొంగిపోతున్నట్లు పేర్కొన్నారు. అరబ్ 8 ఏళ్లుగా అనేక ప్రధాన ఘటనల్లో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం, దళ కమాండర్ అరబ్‌తోపాటు డీవీసీఎం హేమ్‌లాల్, తూర్పు బస్తర్ డివిజన్‌కు చెందిన మరో ఇద్దరు మావోయిస్టులు పీపీసీఎం క్యాడర్‌కు చెందిన రంజిత్, కాజల్ ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిపై రూ.32 లక్షల రివార్డు ఉన్నట్లు వెల్లడించారు.

## ఏడుగురు మావోయిస్టుల అరెస్ట్

కొత్తగూడెం క్రైం, జనవరి 15 : యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సుక్మా జిల్లా పోలీస్ అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధి దుల్హేఢ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈ క్రమంలో భద్రతా దళాల రాకను గమనించిన మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించారు. దీంతో జవాన్లు వారిని వెంబడించి ఏడుగురు మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అరెస్ట్ చేసిన మావోయిస్టులు సుక్మా జిల్లాలో జరిగిన అనేక నేర ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**INDUSIND BANK LTD.**
COMMERCIAL VECHILE FOR SALE
1).TS28TA8903 BAJAJ RE DIESELBS6-2021, 2).TS28TB2153 BAJAJ RE CNG BS6-2023, 3). TG28T0305- APE LD BS6- 2023, 4). TS28TB2158- APE CITY CNG- 2023, 5). TS28TB1273-BAJAJ MAXIMA C- 2023, 6). TS28TB0387- BAJAJ RE CNG- 2023, 7). TS04UE4759-BAJAJ RE CNG-2023, 8). TS28TB1923-BAJAJ RE CNG-2023
Cell:7337394783
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, జనవరి 15: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు తెల్లవారు జామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు పూజలు నిర్వహించారు.

పర్ణశాల, జనవరి 15: పర్ణశాల దేవస్థానంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి బుధవారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష తిరుమంజనం నిర్వహించి అన్ని వైదిక కార్యక్రమాలను అర్చక సిబ్బంది ఆచరించి స్వామివారికి కల్యాణం జరిపించారు. భక్తులకు ప్రసాదం అందించారు.

## రోడ్ సేఫ్టీ నియమాలు పాటించాలి
### ఎంవీఐ వెంకటపుల్లయ్య


మాట్లాడుతున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

భద్రాచలం, జనవరి 15: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని భద్రాచలం ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. బుధవారం రవాణాశాఖ యూనిట్ కార్యాలయంలో లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ నిమిత్తం వచ్చిన వాహనదారులకు రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. అనంతరం వాహనదారులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.

## చైనా మాంజా తగిలి వ్యక్తికి గాయాలు

కొత్తగూడెం క్రైం, జనవరి 15 : చైనా మాంజ తగిలి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం కొత్తగూడెంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. సుజాతనగర్‌కి చెందిన బి.చరణ్ సొంత పని మీద కొత్తగూడేనికి తన ద్విచక్రవాహనంపై వచ్చాడు. సూపర్ బజార్‌కి వెళ్తుండగా సింగరేణి మైదానం– చిల్డ్రన్స్ పార్క్ మధ్య దారిలో చరణ్ కాలికి చైనా మాంజ తగలడంతో లోతుగా కోసుకుపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు చరణ్‌ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే చైనా మాంజ నిషేధంపై పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ కొందరు దాన్ని పెడచెవిన పెడుతున్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, ఎస్సై విజయ తమ సిబ్బందితో పతంగుల దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. ఇళ్లపై చైనా మాంజ ఎగురవేస్తున్న యువకుల నుంచి దారాలను స్వాధీనపరుచుకుని వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

## మొక్కలు నాశనంచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


పల్లె ప్రకృతివనంలో ధ్వంసమైన మొక్కలు

రామవరం, జనవరి 15 : మండలంలోని మాయాబజార్ పల్లె ప్రకృతివనంలో 5వేల మొక్కలను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ కోరారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం సుమారు 5వేల మొక్కలతో రూపుదిద్దుకొని పర్యావరణ సంరక్షణకు దోహదపడుతున్నదని అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు ఖర్చు చేసిందన్నారు. సింగరేణి ఏరియా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రకృతి వనం మొక్కలను నరికివేసి నాశనం చేశారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## క్వార్టర్ ఫైనల్‌కు చేరిన యూసఫ్ కప్ క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

బూర్గంపహాడ్, జనవరి 15: బూర్గంపహాడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జరుగుతున్న యూసఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. గురువారం నాలుగు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు నిర్వాహకులు షీల్డ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆంధ్రా కోడిపందేల్లో 'రేగా'


రేగా కాంతారావుతో ఆంధ్రా నాయకులు

మణుగూరు టౌన్, జనవరి 15: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏపీలోని బుట్టాయిగూడెంలో జరిగే కోడి పందేలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఆయన నివాసంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ట్రాక్టర్ పోటీలు డ్రైవర్ల సామర్థ్యాన్ని పెంచుతాయి


టాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపహాడ్, జనవరి 15: ట్రాక్టర్ పోటీలు డ్రైవర్ల సామర్థ్యాన్ని పెంచుతాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని మోరంపల్లిబంజర గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు డ్రైవర్ల పనితనాన్ని గుర్తుచేస్తాయని, పోటీల్లో 50 మంది డ్రైవర్లు పాల్గొనగా జింకల సుందరరామిరెడ్డి ప్రథమ, బుడ్డగూడెం గ్రామానికి చెందిన బొర్రా శ్రావణ్ ద్వితీయ, మర్రికుంటకు చెందిన మడకం రాజు తృతీయ బహుమతులు సాధించగా వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు.

## పందెం రాయుళ్ల అరెస్టు

పినపాక, జనవరి 15: మండలంలోని టీ కొత్తగూడెం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో మంగళవారం ఈ బయ్యారం పోలీసులు దాడిచేసి 13మందిని అరెస్టు చేశారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై తన సిబ్బందితో కలిసి కోడి పందేల స్థావరంపై దాడిచేసి 13మందిని అరెస్ట్ చేసి 16 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, రూ.3100, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సమ్మిరెడ్డికి నివాళి

మణుగూరు టౌన్, జనవరి 15: మండలంలోని కొండాయిగూడెం శివాలయం ధర్మకర్త పన్నాల సమ్మిరెడ్డి రెండు రోజుల క్రితం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్ మృతుడి ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ప్రగాఢ సంతాప, సానుభూతిని వ్యక్తం చేశారు.

## ఎస్సీ వర్గీకరణ న్యాయమైన ఉద్యమం

రామవరం, జనవరి 15 : ఎస్సీ వర్గీకరణ న్యాయమైన, ధర్మమైన సామాజిక ఉద్యమమని, ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతు ప్రకటించాలని పలువురు వక్తలు కోరారు. ప్రముఖ విద్యావేత్త, అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత సిద్దెల రవి అధ్యక్షతన రామవరం మాదిగ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. వచ్చే నెల 7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన వేల గొంతుకలు... లక్ష డప్పుల సాంస్కృతిక కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలన్నారు.

# సర్వేను పకడ్బందీగా చేపట్టాలి : జడ్పీ సీఈవో


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో, హాజరైన అధికారులు

మణుగూరు టౌన్, జనవరి 15: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బీ.నాగలక్ష్మి ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. అనంతరం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అమలుపై అధికారులతో సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యప్రసాద్, తహసీల్దార్, ఎంపీవో, ఎంఏవో, మున్సిపల్ అధికారులు, పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, జనవరి 15: ప్రభుత్వ పథకాల అమలు సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, ఇతర శాఖల అధికారులతో తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ బుధవారం సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వం 26 నుంచి ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాలకు సంబంధించి సర్వేను ఎలా చేపట్టాలి, ఏఏ పనులు చేయాలనే దానిపై చర్చించారు.

పాల్వంచ రూరల్, జనవరి 15 : ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారు ఆయా పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాతతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పథకాల అమలు కోసం ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు లబ్ధిదారుల గుర్తింపు చేపట్టి, 21న మున్సిపాలిటీ, పంచాయతీ వార్డుల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు.

బూర్గంపహాడ్, జనవరి 15: ప్రభుత్వ పథకాల అమలు సర్వే పకడ్బందీగా జరగాలని తహసీల్దార్ ముజాహిద్ అన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి మండలంలోని ఆయా శాఖల అధికారులతో బుధవారం బూర్గంపహాడ్ రైతువేదికలో సమావేశం నిర్వహించారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

రామవరం, జనవరి 15 : సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ కోరారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారికి కూడా రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రేషన్‌కార్డులు ఉన్నవారికి పిల్లల పేర్లను నమోదు చేయాలని కోరారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ దగ్ధం

పాల్వంచ, జనవరి 15 : పట్టణంలోని శ్రీరక్ష ఆస్పత్రిలో మంగళవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ జరిగి ఆపరేషన్ థియేటర్ కాలిపోయింది. వివరాల్లోకెళ్తే.. రాత్రి సమయంలో ఆపరేషన్ థియేటర్‌లో మంటలు చెలరేగి ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో ఆస్పత్రి సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

రామవరం, జనవరి 15: గుంతను తప్పించబోయి రెండు ఆటోలు ఢీ కొనడంతో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన మంగళవారం రామవరం టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ కృష్ణా జిల్లా మైలారం మండలానికి చెందిన నర్సయ్య ప్రతిరోజు తమ ప్రాంతం నుంచి పూలను తీసుకొచ్చి ఇక్కడ వ్యాపారులకు అందజేసి తిరిగి సాయంత్రం వెళ్తాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తన గ్రామానికి వెళ్తుండగా మహాలక్ష్మి ఆలయం వద్ద రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో తీవ్రగాయాలపాలైన నర్సయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు.

## నేస్తం ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

బూర్గంపహాడ్, జనవరి 15: మండలంలోని మోరంపల్లి బంజరలో నేస్తం ట్రస్టు ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసాయి. సీజన్–3 జట్టు విజేతలకు నేస్తం ట్రస్టు నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు.

## ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

టేకులపల్లి, జనవరి 15: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు విఫలం కావడంతో పార్టీ ఆధ్వర్యంలో త్వరలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ డంపు స్వాధీనం

కొత్తగూడెం క్రైం, జనవరి 15: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కొండగావ్ జిల్లా అడవుల్లో మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్న క్రమంలో భద్రతా బలగాలకు బుధవారం భారీ డంపు లభ్యమైంది. కొండగావ్ జిల్లా ఎస్పీ అక్షయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పుంగర్‌పాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ బలగాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈ క్రమంలో తుమ్రివాల్ గ్రామ సమీపంలోని అడవులను చుట్టుముట్టి గాలింపు చర్యలు చేపడుతున్న క్రమంలో భద్రతా దళాలకు మావోయిస్టులకు సంబంధించిన భారీ డంపు లభించింది. ఇందులో 14 బర్మార్ తుపాకులు, 14 టిఫిన్ బాంబులు, 2 కుక్కర్ బాంబులు, ఇతర వస్తు సామగ్రి ఉన్నట్లు పేర్కొన్నారు.

## 'మద్యం తాగి వాహనాలు నడపొద్దు'

రామవరం, జనవరి 15 : మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై కుటుంబ సభ్యులకు శోకం మిగల్చొద్దని కొత్తగూడెం టూటౌన్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. బుధవారం టూటౌన్ పరిధిలోని ఐటీఐ వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

## పూరిల్లు దగ్ధం

దుమ్ముగూడెం, జనవరి 15: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఆర్ఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. డి.కొత్తగూడెనికి చెందిన కారం చెంచయ్య, నర్సమ్మకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించిందని ఆర్ఐ వెంకట్ పంచనామా అందజేశారు.